
# కామాక్షి కథ

భానుమతీ రామకృష్ణ



## SCENE – I

పనికోసం వచ్చిన కామాక్షి అత్తగారిముందు – మూర్తీభవించిన అమాయక దేవతలా నిలబడి వుంటుంది. రెడ్డి, తిరుమలం, చిట్టి వాళ్ళ వాళ్ళ వనులు వదిలేసి, కామాక్షి చుట్టూ చేరతారు—

అత్త: నీ పేరేమిటి?

కామా: కామాక్షి (కళ్ళు చక్రాల్లా తిప్పుతూ....దీనంగా)

రెడ్డి: పిల్లకి తగ్గ కళ్ళు – కళ్ళకు తగ్గ పేరు—

అత్త: అన్నట్లు! నీ దేవూరన్నావ్?

రెడ్డి: నువ్వేవూరు నుంచొచ్చావని పెద్దమ్మగారు అడుగుతున్నారు?

అత్త: దానికి చెవులున్నాయ్ లేరా! మీరంతా యెందుకు బెల్లం చుట్టూ చీమల్లాగా! పొండి! మీ పన్లు మీరు చూసుకోండి!

ఏమే! నీకు మొగుడూ – మొద్దులూ వున్నారా?

రెడ్డి: (స్వగతం) ఉండడు....ఉండగూడదు....

చిట్టి: ఆహా! బ్యూటీ!

రెడ్డి: ఛుప్! దాన్ని పొగిడే యోగ్యత నీ కెక్కడిదిరా? నోర్మూయ్!

అత్త: పెళ్ళయిందా....నీకు!?

కామా: అయిందమ్మగారు—

రెడ్డి: (స్వగతం) ఎవడో.... ఆ భ్రాష్ఠుడు....అంటూ పళ్ళు కొరుకుతాడు!!

అత్త: పిల్లలా?

రెడ్డి: (స్వగతం) ఉండరు....ఉండకూడదు....

అత్త: ఏవే! మాట్లాడవ్!

రెడ్డి: ఊరికే ప్రశ్నలువేసి చంపకపోతే పనివ్వకూడదూ– యీ ముసిలోళ్ళే యింత....

కామా: అదంతా ఒక పెద్ద కథమ్మగారూ!

అత్త: అదీ కథ! ఏదో పెద్ద కథ వెనకాల లేందే....మా యింటికి రారే....ఏమిటి ఆ కథా?

రెడ్డి: (స్వగతం) ఈవిడ కథలు వినటానికే పుట్టింది – పనిచ్చి కథ వినకూడదూ.

కామా: మా అమ్మోళ్ళకు పండ్ల కొట్టుందండీ అమ్మగోరూ! నేనే బండ్లో పళ్ళు పెట్టుకొని, యీది....యీదీ తిరిగి అమ్మేదాన్ని....

చిట్టి: పండ్లమ్మేటప్పుడే కామాక్షిని ఎంతమంది కన్నుకొట్టారో! (కోపంగా పళ్ళు కొరుకుతూ).

రెడ్డి : (వాళ్ళని చంపేస్తా)....

అత్త : సరే! యిప్పుడూ పండ్లమ్ముతున్నావా?

కామా : లేదమ్మగారూ!

అత్త : పండ్లమ్మే నీకు పనీపాటా ఎట్లా తెలుసూ?

కామా : పండ్లవ్యాపారం లేనిసైములో ఎవరింట్లోనన్నా పని చేసేదాన్ని—

అత్త : మీ ఆయనేం జేసేవాడే?

చిట్టితో-రెడ్డి : వాడెవడో దుర్మార్గుడై వుంటాడు.... చూడు....వాడి మాటెత్తగానే దాని ముఖం యెలా అయ్యిందో!

తిరు : ఎవరీవడె?

చిట్టి : పనికోసమొచ్చింది!

తిరు : పనికోసమా! యింతవరకు యింత అందమైన పనిమనిషి ఎప్పుడూ రాలేదు.

రెడ్డి : వచ్చావ్! నీకు అంట్లు తోమటానికి అందమెందుకోయ్! బోడి నామాలూ! వంటయిందా?

తిరు : అయింది.

అత్త : అయితే పిల్లలున్నారా? ఇంతకీ....

కామా : మూడేళ్ళ కొడుకున్నాడమ్మగోరూ....

రెడ్డి : చంపాడు....వాడొకడు....దరిద్రుడు....

అత్త : అయితే, పిల్లాడితో పనీపాటా చేయడం కష్టంగదూ?

కామా : పిల్లోడీడ లేడండమ్మగోరూ!

రెడ్డి : అబ్బ! రక్షించాడు....

అత్త : అయితే ఎక్కడున్నాడు?

కామా : మా అమ్మోళ్ళకాడే వదిలేశా! మరేంజెయ్యనమ్మగోరూ - మా ఆయన ఆణ్ణి రోజూ కొట్టిచంపుతూంటే...

అత్త : ఏం! ఎందుకూ! కన్న తండ్రి అలా....

కామా : అయ్యో! పెద్దమ్మగోరూ! ఏం చెప్పమంటారు? పిల్లోడు ఆయన్ని "నాన్న" అని పిలవడు....అందుకని...

రెడ్డి : ఆ త్రాష్టుణ్ణి పిలవడు....పిలవకూడదు....

అత్త : అదేమిటి! ఆశ్చర్యంగా వుందీ! ఎందుకు పిలవడు కన్నతండ్రిని నాన్నా అని....

కామా : అదొక పెద్ద కథమ్మగోరూ. పిల్లోడు ఆయనకు పుట్టినోడు కాదంటాడు....

తిరు : అదీ! కథ! ఏదో విషయం లేకపోతే....

రెడ్డి : ఛుప్! నోర్ముయ్! వాడికి పుట్టలేదు....పుట్టకూడదు... అంత దుర్మార్గుడికి బిడ్డ పుడితే పరమదుర్మార్గుడు అవుతాడని కామాక్షి అనుకొని వుండొచ్చు!

కామా : నన్ను పుట్టింటో వుంచీ ఇంకోదాంతో కాపరం చేస్తా వుండీ....పెండ్లయిన కాణ్ణించీ నన్ను నానా కష్టాలూ పెడ్తున్నాడు....

రెడ్డి : దుర్మార్గుడే....యిలాంటి పుత్తడిబొమ్మను వదిలి ఇంకో దాని వెంట ఎలా వెళ్ళాడో వాడు.వాడు మనిషి కాడు....

తిరు : అదేగదా! ఏదో! దీని తప్పుగూడ వుంది....లేకపోతే....

రెడ్డి : ఛుప్! నోర్ముయ్!

కామా : ఎన్ని కష్టాలు పెట్టినా....తాక్కుండా వుంటే బాగుండేవాడు....తాగి ఇంటికొచ్చి....రోజూ తంతాడమ్మగోరూ....కామాక్షి కళ్ళు తుడుచుకుంటుంది.

రెడ్డి : మొరటు రాస్కెల్! వాడి డొక్క చీరేస్తా!

తిరు : కరివేపాకు చిగురులాంటి కామాక్షిని తన్నడానికి వాడికి చేతులెలా వచ్చాయో?

రెడ్డి : తిరుమలాచారీ! తిరగ మోత వర్ణనలో పడ్డావా? కామాక్షి కరివేపాకా?

చిట్టి : కామాక్షిని చూడగానే అయ్యోరికి కైపెక్కినట్టుంది?

తిరు : హే! శ్రీనివాసా! నేను బ్రహ్మచారిని....

రెడ్డి : ఆ మూడు పోగులూ ఎన్ని తప్పులైనా కాస్తయ్ లేవోయ్!

కామా : మా అమ్మకు అసలు ఈ పెళ్ళి యిష్టంలేదు. అందుకే నన్ను పుట్టింటికి పిల్చుకెళ్ళింది. పుట్టింట్లోనే పిల్లాడు పుట్టాడు—

తిరు : అదీ వాడి అనుమానం....

రెడ్డి : కనిపెట్టావ్! గొప్పబుర్ర! నోర్ముయ్!

కామా : పిల్లోడు పుట్టినప్పట్నుంచీ పుట్టింట్లోనే వుంటినీ.... వాడికి తండ్రెవరో తెలిస్తేగా "నాన్నా" అని పిలవడానికి—

రెడ్డి : కరెక్టు! ఆ త్రాష్టుణ్ణి పిలవడు....పిలవగూడదు....

తిరు : మధ్యలో నీ కెందుకీ ఆరాటం! కార్షెడ్డు వదిలి....

రెడ్డి : నాతో నీ కెందుకీ పోరాటం : వంటిల్లొదిలీ....

చిట్టి : కామాక్షిని చూస్తే అందరూ అన్నీ వదిలేస్తారు. రెడ్డి గుర్రున చూస్తాడు.

అత్త : అయితే! ఇంతకీ మొగుడు దగ్గరికి ఎలా చేరావ్?

కామా : మొన్నే మావాళ్లు రాజీపడి నన్ను ఆయనవెంట పంపారు. మా అమ్మ కిష్టంలేదు....నేను మొగుడితో వుంటం....

రెడ్డి : కరెక్టు! ముందు నాకిష్టం లేదు....ఆ వెధవతో వుండటం....

అత్త : సర్లే! పన్లోజేరు....ఒరే తిరుమలం! దానికి పనులు యేవేం చేయాలో చెప్పరా!

చిట్టి : అదృష్టవంతుడే! నావాలూ - యెప్పుడూ కళ్ళముందే వుంచుకోవచ్చు యీ కామాక్షిని. (కామాక్షి బావిదగ్గర పని చేస్తుంటుంది. రె. చి. పరిచయం చేసుకుంటారు.)

రెడ్డి : ఈ పెద్దమ్మగారికిదో పెద్దరోగం. బయట ఒక్క కుళాయి పెట్టించకూడదూ ! యిన్ని అంట్లు తోవ డానికీ....గుడ్డలుతకడానికీ ! పాపం కామాక్షి ఒక్కతే ఎన్ని నీళ్ళని తోడుతుందీ !

తిరు : పెద్దమ్మగారూ ! కుళాయి వంటింటి వరకే అన్నారు. (యింతలోకే కామాక్షి అబ్బా ! అంటుంది. రె. చి. తి. ఏవిటేవిటంటూ చుట్టూ చేర్తారు....

కామాక్షి చెయ్యెత్తలేనట్లు నటిస్తుంది....)

కామా : ఏం లేదు !

రెడ్డి : ఏం! వుందీ ! ఆ రాక్షసుడు కొట్టుంటాడు !

కామా : (అవునన్నట్లు తల వూపుతూ) (రెవికని కాస్త లాగుతుంది వీపుమీద్ది - రెవిక చిరుగుతుంది)

రెడ్డి : అబ్బ !....అబ్బ ! ఎంత కోమల శరీరం....

(రె.తి.చి. దాని వీపులో ముఖం పెట్టి)—

కామా : అబ్బా ! నిన్న ఇక్కడే కర్ర తీసుకొని బాదాడు !

రెడ్డి : అందుకే బెణికింది రెక్క....

రె.తి.చి : ఉండు కామాక్షీ ! మేం తోడిపెడతాం ! మేం తోడిపెడతాం ! ఏం చేస్తాం....మరీ! పాపం! నువుండు కామాక్షీ! (కామాక్షి గూడ నొక్కుకుంటూంటుంది వీళ్ళని చూస్తూ....)

**Scene Ends**

## SCENE – II-HALL

(కామాక్షి గబగబ-బయల్దేరుతుంది-అత్తగారి దగ్గరకొచ్చి)

కామా : పెద్దమ్మగోరూ ! సాయంకాలం ఇంటికి పెందరాళే ఎళ్తాను—

అత్త : ఏమే! కాస్త లేటుగా వెళ్తే ఏం !

కామా : ఆయనొట్టి అనుమానం మనిషమ్మా!

అత్త : ఎవడే వాడు! ఒక్కసారి నీ మొగుణ్ణి చూపించు.... మొఖం వాచేట్లు నాలుగు చీవాట్లూ పెడతాను....

కామా : అయ్యో! పెద్దమ్మగారూ! మీ రా య న్ని చూస్తే అసహ్యించుకుంటారు. తాగి, తాగి, గుడ్లు పైకొచ్చి గుడ్లగూబలాగుంటాడు. కోపం జాస్తి....సచ్చినోడు.... ఎప్పుడూ కత్తి దగ్గర పెట్టుకునుంటాడు—(కత్తిమాటన గానేఅత్తగారు-మళ్లా వాణ్ణి చూపించమనిగానీ-దాన్నుండ మనిగానీ చెప్పకుండా)

అత్త : వీడెవడే! రౌడీ చట్టంగా వుందే! వెధవ ఫీడా ! సరే ఫో ! యింటికి యింకా పెందరాళే ఫో ! ఆ వెధవ గేట్లోకి రాకముందే ఫో ! ఫో ! (అంటూ తరుముతారు). (కోడలితో) ఎవరన్నా మంచి పనిమనిషి దొరికితే దీన్ని పంపించేద్దామే ! ఆ రౌడీవెధవ కత్తిపట్టుకుని, దీని వెంట తిరుగుతూంటే కష్టంగదూ ! మన ఘూర్కాతో గట్టిగా చెప్పు హిందీలో....వాడు చచ్చి....గీ.... పెట్టినా లోపలికి రానివ్వొద్దని—అన్నట్టు మన ఘూర్కా దగ్గరకూడా కత్తివుంటుంది....కదూ....

కో : ఏం భయం లేదులెండి....

(రె.చి.తి. అంతా వింటుంటారు.)

రెడ్డి : చందనం బొమ్మలాంటి కామాక్షికి ఆ మొగుడేంటి ! వెధవ....వాడి కళ్లూ....వాడూ....!

చి: కామాక్షి చెప్పిందిగా వాడు గుడ్లగూబలా వుంటాడని....

రెడ్డి : వాడు వార్నీషు తాగుతాడంట !

చి : అవును — వాడికి దగ్గని చెప్పింది—

తి : రోజూ మిరియాల చారు ఒక గ్లాసు తాగితే ఆ దగ్గు పోతుంది—

రెడ్డి : తిరుమలాచారు తాగితే ఇంకా మంచిది—వంటయిందా?

తి: అవుతూంది....

రెడ్డి : అయితే పోయ్....భోంచేయ్ !

తి : సరే ! నువ్ వేంచెయ్ !

**Scene Ends**

## SCENE – III

కామాక్షి మొగడు గేటుదగ్గర నిలబడి వుంటాడు-చిట్టి పరుగెత్తుకొని వస్తాడు—

చి: అమ్మా! కామాక్షి మొగుడు గేటుదగ్గర నిలబడివున్నాడు-కామాక్షిని పిలుస్తున్నాడు—

అత్త: ఒసే!కామాక్షి-నీ మొగుడు గేటుదగ్గరకు వచ్చాడంట-తొందరగా పో!

కా: నే పోనమ్మగారూ! వాణ్ణి ఘూర్కాచేత గెంటించండి—

అత్త: (గాబరాగా) యిదేమిటి! నీ మొగుడొచ్చి పిలుస్తే-పోనంటావేంటి?

కా: నే పోనండమ్మగారూ! ఆడు తాగొచ్చి కొట్టి సంపుతా వున్నాడు. రాత్రంతా చచ్చేట్లు దగ్గుతావున్నాడు. ఆడి రోగం నాకొచ్చేట్లుంది.


రెడ్డి: అవును పెద్దమ్మగారూ! అది జబ్బు, కామాక్షికొచ్చే అవకాశాలున్నయ్!

అత్త: నీకెందుకురా! అయినా నీకెన్నిసార్లు చెప్పాను.... దాని విషయంలో కలుగజేసుకోవద్దని

చి: మాకేంటమ్మా! ఆడకూతురు! ఆ రోగిష్ఠి మొరటోడుతో నానా అవస్తా పడతావుంటే....పాపం....అని....

తి: సరేజనాః స్సుఖినోభవంతు-ఎవరూ బాధలుపడగూడదు అందులోనూ కామాక్షి అసలు కష్టాలు పడగూడదు....

అత్త: అంతేనట్రా! మీ బాధ! ఒక ఆడకూతురుమీద



అనవసరంగా యింతభిమానం మీ అందరికీ ఎందుకుండాల్రా? తెలీకడుగుతా! వెధవ్వేషాలు కాకపోతే....

రె: మాకేంటమ్మా! ఏదో అంతా ఒకచోట పన్జేసేవాళ్ళం కదానీ....అతన్దేదో అంటువ్యాధంటున్నారు....అసలు కామాక్షికి ఆ జబ్బు ఎక్కడొస్తుందోనని....

అత్త: ఓహో! అదన్నమాట....మీ భయం....మరేం భయం లేదు! మీ పని మీరు చూసుకోండి! అలుమగలకి అంటువ్యాధేమిట్రా! తిక్క వెధవ? అయినా పదే పదే, దాని మొగుడి సంగతీ, వాడి రోగం సంగతీ మీకెందుకు? ఫోండి!....మీ పన్లు మీరు చూసుకోండి.... (అందరూ వెళ్ళినట్లె వెళ్ళి చాటున నిలబడతారు.)

అత్త: ఫోవే! యింటికి?

కా: నే ఫోనండమ్మగారూ! ఆణ్ణి గెంటించెయ్యండి.

అత్త: మొగుణ్ణి వాడంటుంది? గెంటించెయ్యమంటుంది! యిదీ మరీ బరితెగించిన బజారీలాగుందే! దీన్ని చూస్తే నా ఒళ్ళు మండిపోతోంది—

కో: ఎక్కువ మండిపడకండి–మనకి వేరే పనిమనిషిలేదు....

అత్త: అవునవును....అదొక కష్టం....

కామాక్షీ! (గేటుదగ్గరనుంచి శబ్దం కర్కశంగా)

రెడ్డి: వార్నీషు వెధవ! వాడి గొంతు విన్నావా? కసాయి గొంతు....

చి: మొరటోడు .... సింహబలుడు .... సాహసవంతుడు.... ఖైదీ నెం. 77.

తిరు: కాదు....యుగపురుషుడే....

అత్త: యిదేమిటి! యిదిట్లా తిరుక్కుందీ! యిప్పుడేం చేయడం!

కో: మనం మాట్లాడ కూరుకుంటే సరి....

రె: అమ్మగారు....కరెక్టుగా చెప్పారు....

అత్త: మనం మాట్లాడకూరుకుంటే, వాడొచ్చి .... దీన్ని బలవంతంగా లాక్కెళ్ళిపోతే, యీ వెధవలు వెళ్ళి అడ్డుపడి వాణ్ణేవన్నా అంటే....వాడసలే తాగుబోతు వెధవ....వీళ్ళమీద చెయ్‌జేసుకుంటే కష్టంగదే! తర్వాత పోలీసులూ....గొడవా!

కో: (నవ్వాపుకుంటుంది). అత్తగారు కామాక్షి దగ్గరకెళ్ళి–వసుదేవుడు గాడిదకాళ్ళు పట్టుకున్నట్లు,

అత్త: ఒసే! కామాక్షీ! మా తల్లివికదూ! నీకు పుణ్యం వుంటుందీ! నీ మొగుడు కేకేస్తున్నాడు, వెళ్ళమ్మా!

రెడ్డి: (స్వగతం) వెళ్ళదు....వెళ్ళకూడదు....

కా: నేవెట్టబోయేదీ! పెద్దమ్మగోరూ! ఆస్పత్రిలో జేరమంటే జేరడు—రోగం నయం చేసుకోడు–నన్నిడిసి వెళ్లనంటాడు అనుమానం మనిషి! ఆ జబ్బు నాక్కూడా రావచ్చని డాక్టర్లు చెప్తావుంటే! యినకుండా మొండిపట్టు పట్టావుంటే నేనేం చేసేది చెప్పండి?

రెడ్డి: మొరటు వెధవ! వాడికి మనమే యింత గడ్డిపెడదామా పశువు....(అంటాడు తిరుతో.)

తిరు: నేనెప్పుడూ అన్నమే పెడ్తాను. గడ్డికావాలంటే నువ్వే పెట్టు....

రెడ్డి: అబ్బ! దిబ్బమొహానికి జోకు వేరే! (చిట్టితో.) పదరా! వాడి సంగతేదో చూద్దాం!....

చి: నాకు వాడిని చూస్తేనే గుండె జారతావుందే!

రెడ్డి: ఫర్వాలేదు .... నేనున్నాగా.... (ముగ్గురూ గేటుదగ్గరకెళ్తారు.వీళ్ళని చూస్తూనే కైపులోవున్న కామాక్షి మొగుడు కత్తితీస్తాడు–తక్షణం తి.రె.చి. ఘూర్కావాడి వెనక్కి వెళ్ళి దాక్కుంటారు.)

కా.మొ: ఏంరా! మీరు ముగ్గురేనా! నా పెళ్ళాన్ని యింటికి రాకుండా అడ్డుతావున్నారు. నాయాళ్ళల్లారా! నరికి పోగు లేస్తా:.... (అంటూ ముందుకు దూకుతాడు-ఘూర్కా-వాణ్ణి గెంటేస్తాడు. పోతూ.... పోతూ....)

బయటికి రండిరా! మీ సంగతి తేలుస్తా! (అంటూ సవాల్ చేస్తాడు).

తిరు: హే! శ్రీనివాసా! రక్షించు!....(రె.చి.తి. ఘూర్కా-బుజాలు గట్టిగ పట్టుకుంటారు. భయపడిపోయిన చిట్టి రెడ్డితో.)

చి: రెడ్డీ! చెమటలు పోస్తావున్నయ్! టీ దాగుదాం! పదరా!

రెడ్డి: వద్దు.... వద్దు....

చి: మరి రెండోఆట సినిమా కెళ్దామన్నావే! యీ రోజు.

రెడ్డి: వద్దు....వాడు తాగుబోతువెధవ .... అందులోనూ వార్నీషుతాగే వెధవ....తెగించి కక్షతో ఏంచేసినా చెయ్యొచ్చు. పిచ్చివాడిచేతిలో రాయి-వాడి చేతిలో కత్తి-

చి: అర్జెంటుగా టీ తాగాల్రా!

రెడ్డి: నీకు అంతగా టీ తాగాలంటె, ఆ తిరుమలంగాడి కాళ్ళు పట్టుకుందాం, కాస్త టీ నీళ్ళిమ్మని....

చి: వాడి టీ సాంబారు కంపుకొడ్తుందిరా!

రె: ఎలాగో ఎడ్జెస్ట్ చేసుకుందాం! పద!

**Scene Ends**

## SCENE – IV

(అత్తగారు కూర్చుని వుంటారు.)

అ: తిరుమలం!....ఎవరూ కూరగాయలు తేలేదేమిట్రా?

తి: ఊహుఁ! నే బయటికి పోను. వడలకు పిండిరుబ్బాంది... వంటపని సరిగ్గా వుంది....పోవడానికి లేదు....చిట్టిని పంపండి మార్కెట్టుకి....

చి: ఊహుఁ! నేనూ బైటికి పోను. నాకు కాలు బెణికింది. కావాలంటె రెడ్డిని పంపండి....

రె: ఊహుఁ! నేనూ బైటికిపోను....నే పోలేను....నా కొంట్లో బాగోలేదు....

అత్త: యిదేమిటీ! యిదీ, వీళ్ళంతా బయటికి పోమంటూ సమ్మె చేస్తున్నారు.

కో: (నవ్వాపుకుంటూ) అది కాదండీ! ఆ కామాక్షి మొగుడు వీళ్ళని బయటికొస్తే పొడుస్తానని బెదిరించాట్ట....అందుకే భయపడి చస్తున్నారు.

అ: అదా సంగతి....అవును నిజమే....వాడు దుర్మార్గుడే.... అయినా యీఫీడా మనకు పట్టుకుందేమే! యిదియింటికి పోనంటుంది....వాడేమో మన గేటు వదలడు....

## SCENE – V

(కామాక్షి ఉత్తరం చదువుతుంటుంది. రె.చి.తి. చుట్టూచేరి వింటుంటారు. కామాక్షి కళ్ళు తుడుచుకుంటుంది—)

రె: ఏమైంది కామాక్షి! వాడేం రాశాడు?

కా: నేను మాట్లాడకపోతే యిషం తిని సచ్చిపోతాట్ట-గేటు దాకా పోయి రెండేరెండు మాటలు మాట్లాడి వస్త....

రె: ఆఁ! వాడితో మాట్లాడతావా! వాడితోకూడా చచ్చినా యింటికెళ్ళొద్దు....

చి: అవును....యిక రానివ్వడు....ఎత్తే....

తి: అయ్యో! కామాక్షి రావాలి! అది వచ్చాకనే వంటింటికి కళ వచ్చింది!

కా: నేను మీకు చెప్పకుండా పోనుగా....(అంటూ గేటువైపు వెళ్తోంది.)

చి: ఏం....మాట్లాడుతుందో....విందామా....

రె: ఆ వార్నీషు వెధవ మనల్ని చూస్తే కత్తి తీస్తాడ్రా! అందుకే ఆగాను....

చి: నువ్వొస్తావా....తిరుమలం....

తి: ఊహుఁ! నాకు వంటింట్లో పనుంది....

రె: ఏం మాట్లాడుతున్నారో! కామాక్షిని వాడేం హింసపెడుతున్నాడో....

చి: అదే! పాపం! వాడి రోగం కామాక్షికి ఎక్కడ వస్తుందో.

రె: రాదు....రాకూడదు....కామాక్షిని నేను కాపాడుతాను.... కామాక్షి కళ్ళు తుడుచుకుంటూ—

రెడ్డి: ఏంజరిగింది....కామాక్షీ!....

చి: వాడాస్పత్రికి పోతానన్నాడా?

కా: (తలతిప్పుతుంది....పోనన్నాడని....)

తి: వాడెక్కడ పోతాడు....కామాక్షిని కష్టాలు పెట్టడానికే కంకణం కట్టుకున్నాడు....

చి: అయ్యగారితో చెప్పి వాణ్ణి కాళ్లూ చేతులు కట్టి ఆస్పత్రిలో పడేయించగూడదూ....?

రె: అయితే యింతకీ వాడేమంటాడు....కామాక్షీ!

కా: మూడొందల రూపాయలిస్తే తనేదో ఊరెళ్ళి అన్నే ఓ ఏడాదుండి-వుబ్బు నయం చేయించుకొస్తా నంటున్నాడు. మూడొందల రూపాయలు నేనేడ్నించి తెచ్చేదీ! (కళ్ళు తుడుచుకుంటుంది చి.రె.తి. ఒకళ్ళ ముఖాలొకరు చూచుకుంటారు.)

రెడ్డి: వాడికి బుద్ధుందా! పెళ్ళాన్ని అంత డబ్బు తెమ్మని అడుగుతాడా! నేనైతే కామాక్షిని పువ్వుల్లోపెట్టి పూజించే వాణ్ణి!

చి: తీరా డబ్బుతీసుకుని పోకపోతే....

తి: కాళహస్తి కంచులాంటి కామాక్షిని వదలి వాడు వెళ్ళడు... ఆ డబ్బు తీసుకుని కొన్ని రోజులు తాగి, తందనాలాడి తిరిగొస్తాడు....

రె: చే! అపశకునం....రాడు....రాకూడదు....

కా: రానన్నాడు....వచ్చినా నేనీ తావిడిసిపెట్టి రానని చెప్పేశాను .... పత్రంకూడా రాసిమ్మన్నాడు .... నాకు మొగుడు అవసరంలేదని....రాసిస్తానన్నా....

రె: అబ్బ! పీడ వదిలిపోతుంది .... కామాక్షీ! నీకు నే నున్నాను....

చి: నేనేమిటోయ్! మేమున్నాం....అను....(రెడ్డి వాళ్ళందరికీ సౌంజ్ఞ చేసి తి.చి.ని పక్కకి తీసుకెళ్ళి.)

రె: పోతే పోతుంది....మనజీతాల్లోంచి ముగ్గురం—మూడొంద లిద్దాం!

చి: అలాగే! కామాక్షి యిక్కడే వుండిపోతుంది....

తి: అదీ కావలసింది.... ఓ.కె.—

రె: ఓ.కె.—కమాన్....)కామాక్షి అమాయకంగా నిలబడి వుంటుంది....వీళ్ళనిచూస్తూ....)

**Scene Ends**

## SCENE – VI

(కామాక్షి అందంగా డ్రస్‌చేసుకుని వస్తుంది).

తిరు: కామాక్షి యిప్పుడు కడిగిన ముత్యంలావుంది.

రె: యిప్పుడు కామాక్షి ముఖం మబ్బుయిడిసిన ఎండలా వుంది....

తి: అందుకే అన్నారు....మబ్బు యిడిచిన ఎండ—మొగుడు విడిచిన ముండని....

చి: ఛుప్! ఎదవసామెతా నువ్వూను....కామాక్షి సినిమా హీరోయిన్‌లా వుంది నా కంటికి....యింత అందంగా వుండే కామాక్షికి అలాంటి మొగుడుండడం....

రె: ఉండడు .... ఉండగూడదు .... కామాక్షీ! యిలాగే నువ్వెప్పుడూ సంతోషంగా వుండాలి....

చి: అవును....మాకంతే కావల్సింది....యింద పూలు.

రె: వాసనలేని పూలిస్తావేమిట్రా!....అన్నట్లు కామాక్షీ! నువ్వే సోప్ వాడతావ్....ఒంటికి....

చి: లక్స్ సుప్రీమ్....సినిమా వాళ్ళంతా వాడతారు అదేనా!

రె: ఛుప్! సినిమా పేరెత్తక!....కామాక్షి దేవత....కామాక్షి Life buoY నేను—యిదుగో ఈ Life buoy Soap వాడు

Bit song: కామాక్షీ....ఎక్కడనో....Life boy....అక్కడనే....టింగ్....టింగ్....

(తిరుమలం—టిఫెన్ తెచ్చిస్తాడు....కామాక్షి ముగ్గుర్నీ—నవ్వుతూ చూస్తుంటుంది.

లోపల్నుంచి కోడలు కేక—)

కో: కామాక్షీ! అంటూ కోడలు చేతిలో Telegram తో వచ్చి, కామాక్షి కిచ్చి—

కో: నీ మొగుడు వేలూరు ఆస్పత్రిలో సీరియస్‌గా పడున్నాడట....తక్షణం రమ్మని Telegram యిచ్చాడు....

(కోడలు Exits—కామాక్షి కంటపడుతుంది. రె.తి.చి. దగ్గరగా వచ్చి—)

కామా: నేనెలా వెళ్ళేది? ఎళ్ళకపోతే లోకం ఆడిపోసుకుంటుందే!

రె: వెళ్ళకు....వెళ్ళగూడదు....

కా: వెళ్ళాలి....రెండ్రోజుల్లో వచ్చేస్తాగా!....కానిఎట్లెళ్లేదీ... చేతిలో నయాపైసా లేదే!

రె: సరే! రెండ్రోజుల్లో తప్పకుండా వచ్చేస్తావ్ కదూ! కామాక్షీ!....ఆ వార్నీషు వెధవకోసం నీ జీవితం పాడు చేసుకోవద్దు .... మేమంతా నీవాళ్ళమే....మాకోసం వచ్చేయ్! నీ ఖర్చులు మేమిస్తాం! వెళ్ళొచ్చేందుకు.... ఊఁ....సరేనా!....(రెడ్డి టక్కున చేతిలోడబ్బుపెడతాడు.

కా: వస్తానూ....! (కామాక్షి Exitsతి.రె.చి.చూస్తుంటారు...)

**Scene Ends**

## SCENE – VII

రెడ్డి సిగరెట్ మీద సిగరెట్ తాగుతూ—

రె: ఏమిట్రా! కామాక్షి జాడ తెలీలేదు—యిది మనల్ని మోసం చేసిందా!

తి: అలాగే వుంది....చూస్తే....

చి: అది భలే తెలివైందని నేనప్పుడే అనుకున్నా!

తి: మనకే తెలివిలేకుండాపోయింది. అత్తగాళ్ళకిబుద్ధిమట్టు—

**Scene Ends**

## SCENEV – III BACK YARD

పాలమనిషి.

అత్త: ఏమే! కామాక్షి ఊర్నుంచి వచ్చిందా?

పా: ఊర్నుంచి రావటం ఏవిటమ్మా! అదిఊర్లోనే....వుంది.

అ: ఆఁ! దాని మొగుడూ?....

పా: వాడు మొగుడూకాదూ....మొద్దులూగాదూ (అళ్ళిద్దరికీ.... ఒక్కోక్కయింట్లో యిట్ట నాటకం అడ్డం అలవాటే!.... యిట్ట శానాడబ్బు సంపాదించా రాళ్ళిద్దరూ....

అ: హవురాఁ! హవురాఁ! ఎంతజాణ .... ఎంతజాణ....

(రె.తి.చి. తలలు పట్టుకుని కుప్పకూలి పోతారు.)

రె: మూడొందల రూపాయలు....

చి: ఆ పైన వడ్డీగా యిచ్చాం....చార్జీలు....

తి: ముడుపు కట్టినా....ముందు జన్మకు పుణ్యం వచ్చేదే!

అ: ఒరేయ్! తిరుమలం! రెడ్డీ! చిట్టీ!మీరంతా యిటురండిరా! విన్నారా! విన్నారా! దాన్ని వెనకేసుకొస్తిరే! ఇంకో పనిమనిషి దొరికేదాకా—దాని పనంతా మీరే చెయ్యండి... తెల్సిందా!....ఓరీ! చిట్టీ చీపురుతెచ్చి యిల్లు చిమ్ము శుభ్రంగా-రెడ్డీ! సోఫాలూ,యిల్లూ తుడు.ఒరే! తిరుమలం! అంట్లుతోమూ!....

చి: మూలిగే నక్కమీద తాటికాయ....

తి: హే! శ్రీనివాసా....

అత్త: యీతడవ ఏనకాముందూ లేని ఆడదాన్నిగా చూడాలి.

**Scene Ends**

ఇందులోని సంభాషణలు, సీనులు రచయిత్రి లిఖితపూర్వక అనుమతి లేనిదే అనుకరణ, అనుసరణ చేయరాదు.